గురుబ్రహ్మ.. నమోనమః


సత్కారం పొందిన ఉపాధ్యాయులతో కె.కె. రాజు తదితరులు

- పలు పాఠశాలలు, గ్రంథాలయాల్లో ఘనంగా గురుపూజోత్సవం
- పలువురు ఉపాధ్యాయులకు సత్కారం


ఆర్పీపేట హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, వెంకటలక్ష్మి తదితరులు


సత్కారం పొందిన ఉపాధ్యాయులతో వాసవీ క్లబ్ ప్రతినిధులు

మద్రిపాలెం: విద్యకే అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త, నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె. రాజు అన్నారు. ఉత్తర నియోజకవర్గం 50వ వార్డు మురళీనగర్ వర్మా కాంప్లెక్స్ దరి జేఆర్ ఫంక్షన్ హాల్లో గురుపూజోత్సవం కె.కె. రాజు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గొప్ప విద్యను అభ్యసించే విధంగా గురువులు వారిని ప్రోత్సహించాలని అన్నారు. సీఎం జగనన్న ప్రభుత్వంలో నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ప్రతి విద్యార్థి చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకునేలా టీచర్లు వారిని తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, పి.ఉషశ్రీ, కో ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు ఉపాధ్యాయ పెద్దలు పైడి కృష్ణారావు మాస్టర్, పొన్నాడ అప్పారావు మాస్టర్, నాయుడు మాస్టర్ పాల్గొన్నారు.

సీతంపేట: మధురానగర్‌లోని జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వాసవీ క్లబ్ వాల్తేర్ ప్రతినిధులు ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో సత్కరించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ వాల్తేర్ కపుల్స్ అధ్యక్షుడు కె.వి.రాజ్‌కుమార్, కార్యదర్శి జి. శంభు, కోశాధికారి పి.వినోద్‌కుమార్, వాసవీ వీక్ చైర్మన్ ఐ.ఆర్.కె.ప్రసాద్, ప్రోగ్రామ్ చైర్మన్ వి.పద్మజ, హెచ్ఎంలు శాంతికుమారి, దేముడుబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎన్ఎంసీహెచ్ హైస్కూల్లో నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఆర్పీపేటలో..

కంచరపాలెం: రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏపీ ఐడీసీ డైరెక్టర్ కాయిత వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కాయిత పైడిరత్నాకర్ ముందుగా సర్వేపల్లి రాధకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం హెచ్ఎం శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంసీహెచ్ హైస్కూల్లో..

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులోని ఎన్ఎంసీహెచ్ హైస్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ముందుగా మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు హెచ్.ఎం. రాంప్రసాద్, ఉపాధ్యాయులు నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.


ప్రొఫెసర్ డాక్టర్ ఉజ్వలకుమార్ ఘటక్‌ను సత్కరిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ


సన్మానం పొందిన రైల్వేన్యూకాలనీ స్కూల్ విశ్రాంత అధ్యాపకులు

రైల్వేన్యూకాలనీ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వేన్యూకాలనీలో జీవీఎంసీ పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పలువురు విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. టీఎస్ఎన్ కాలనీలో గల సింకా గ్రాండ్ హోటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ఈ పాఠశాలలో పనిచేసి పదవీ విరమణ పొందిన సీనియర్ అధ్యాపకులు అన్నమ్మ, లక్ష్మి, పూర్ణ, నారాయణ మాస్టర్‌లను ఘనంగా సత్కరించారు.

ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో..

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ దూరవిద్యా విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఉజ్వలకుమార్ ఘటక్‌ను ఘనంగా సత్కరించారు. విద్యార్థులు ఆధ్వర్యంలో అధ్యాపకులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలైనవారికి బహుమతులు అందించారు. కాలేజీలో ఎన్‌సీసీ విభాగం ఏర్పాటుకు తన వంతు సహకరిస్తానని డాక్టర్ ఘటక్ చెప్పారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

మురళీనగర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని సర్వేపల్లి చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రభుత్వ కాలేజీ అధ్యాపకుడు ఎస్.రామమోహన్, క్లబ్ కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, కోశాధికారి జె.కూర్మారావు, ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో..

మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి ఘనంగా నిర్వహించారు. లైబ్రేరియన్ పద్మజ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. పట్టాభిరెడ్డితోటలోని సూర్యోదయ సంస్థలోను, బాలభాను పాఠశాలలోను ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.


సత్కారం పొందిన ఉపాధ్యాయులతో కార్పొరేటర్ ప్రసాద్, మురళీనగర్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

క్లుప్తంగా

రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న నాయకులు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం పరిధి శివలింగ పురం కొండవాలు ప్రాంతాల్లో రూ. 48 లక్షలతో నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను వార్డు కార్పొరేటర్ గంకల కవిత నేతృత్వంలో బీజేపీ వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు, జోన్-5 ఇంజినీరింగ్ అధికారులు మంగళవారం పరిశీలించారు. జీవీఎంసీ నిధులు మంజూరులో సహకరించిన మేయర్ గొలగాని వెంకట హరికుమారికి కార్పొరేటర్ గంకల కవితా కృతజ్ఞతలు తెలిపారు.

కల్లు బాటిళ్లతో స్కూల్‌కు వచ్చిన విద్యార్థులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులోని ఎన్ఎంసీహెచ్ హైస్కూల్ విద్యార్థులు తాటి కల్లు బాటిళ్లతో మంగళవారం ఉదయం స్కూల్‌కు వచ్చారు. ఈ విషయం గమనించిన ఉపాధ్యాయరాలు అనుమానంతో బాటిళ్ల కప్పులు విప్పి చూడగా ఒక్కసారి వాసన రావడంతో పాటు బాటిళ్లలోని కల్లు పొంగింది. దీంతో హెచ్ఎంకు, ద్వారకా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి వారి తల్లిదండ్రులకు విషయం తెలిపారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం కావడం, విద్యార్థులు తాటికల్లుతో రావడం చర్చనీయాంశంగా మారింది.

చెట్టు కొమ్మల తొలగింపు


చెట్టుకొమ్మలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సీతమ్మధార: ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలకు అడ్డంగా ఉన్న చెట్టుకొమ్మలు తొలగించే కార్యక్రమం చేపట్టారు. ద్వారకానగర్, గురుద్వార్, అల్లూరి సీతారామరాజు జంక్షన్‌తో పాటు పలు ప్రాంతాల్లోని సీసీ కెమెరాలకు చెట్టు కొమ్మలు అడ్డంగా పెరిగి ఎలాంటి సీసీ ఫుటేజీ లభ్యం కాకపోవటంతో సీఐ ఆదేశాల మేరకు సిబ్బంది దగ్గరుండి జీవీఎంసీ సిబ్బందితో చెట్టు కొమ్మలను తొలగింపజేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

మద్రిపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాలు ఇలా.. కంచరపాలెం ఇందిరానగర్‌లో నివసిస్తున్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి జి.ఎర్రయ్య (65) మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇంటి నుంచి మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో కంచరపాలెం హైవేపై రోడ్డు దాటుతుండగా తాటిచెట్లపాలెం నుంచి ఎన్ఏడీ వైపు వేగంగా వెళ్తున్న ఓ కారు అతన్ని ఢీకొంది. దీంతో తీవ్రగాయాలైన క్షతగాత్రుడిని సమీపంలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని కుమార్తె రాజేశ్వరి ఫిర్యాదు మేరకు ఐదవ పట్టణ సీఐ ఎస్. సాయి నేతృత్వంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'తాండవ కృష్ణ తారంగం'పై ప్రసంగం


ప్రసంగిస్తున్న వ్యాఖ్యాత రాంభట్ల నృశింహ శర్మ

సీతంపేట: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ప్రముఖ వ్యాఖ్యాత రాంభట్ల నృశింహ శర్మ 'తాండవ కృష్ణ తారంగం'అనే అంశంపై ప్రసంగించారు. కృష్ణుడు చిన్నతనంలో చేసిన అల్లరి, వెన్న దొంగతనం, శ్రీకృష్ణుని లీలలపై ప్రసంగించారు. రామవరపు మాధురీదేవి, వి.చంద్రశేఖరం, బి.విక్రమ్‌గౌడ్, నేతి రాధిక పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ


లబ్ధిదారులకు నూతన పింఛన్లు అందిస్తున్న అల్లు శంకరరావు

మురళీనగర్ : అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు మంజూరు చేస్తామని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, 49వ వార్డు కార్పొరేటరు అల్లు శంకరరావు అన్నారు. వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నూతనంగా మంజూరైన లబ్ధిదారులకు మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్నీ పారదర్శకంగా అమలు చేస్తున్నారని చెప్పారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పథకాలను లబ్ధిదారుల ఇంటికి చేరవేస్తున్నామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో జగనన్న బలపరిచిన నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గం ఎంఎల్ఏ అభ్యర్థి కె.కె.రాజును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర భట్రాజుల డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఎస్.రవికుమార్, విశాఖ ఏఎంసీ డైరెక్టర్ ఐ.రవికుమార్, వార్డు సీనియర్ నాయకులు ఆదిరెడ్డి శ్రీనివాస్, కర్రి రామిరెడ్డి, కె.ఢిల్లీరావు, ఆర్.చిన్నారావు, జె.వెంకటరావు, ఎల్.వి.సుధాకర్, ఎస్.కె.మస్తాన్, సబ్బవరపు శ్రీనివాస్, ఆర్. చంద్రమౌళి, బి.శంకర్, పి.నాగరాజు, కె.అప్పారావు, శ్రీరాములు, పల్లా చైతన్య, కె.మున్నా, కె.కిషోర్, ఆర్.భవానీశంకర్, వినయ్, నాయుడు, మహిళా నాయకులు బి.సరస్వతి, సీహెచ్ శ్యామల, బి.శంకుతల, కె.మంగ, అచ్యుత, సత్యవేణి పాల్గొన్నారు.

మలేషియాకు సాయి కోలాటం సభ్యులు


సాయి కోలాటం సభ్యులు

సీతమ్మధార: అన్నమయ్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్టోబర్ 27వ తేదీన మలేషియాలో జరగనున్న శ్రీనివాస కల్యాణంలో పాల్గొనేందుకు సీతమ్మధారకు చెందిన సాయి కోలాటం సభ్యులు పది మంది ఎంపికయ్యారు. వారు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీ మహా గణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, షిర్డీసాయి ఆలయంలో ఈవో శేఖర్ బాబు, ప్రధాన అర్చకుడు రాజా స్వామి, ట్రస్ట్ సభ్యుల సహకారంతో ప్రతి రోజు ఆలయ ఆవరణలో శిక్షణ పొందుతున్నారు. శ్రీ వేంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఏపీ, తెలంగాణ డైరెక్టర్ సునీత కొఠారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. కాగా కోలాటం సభ్యులకు తిరుపతికి చెందిన శేష్మ శిక్షకురాలిగా వ్యవహరిస్తున్నారు. విశాఖ నుంచి 25వ తేదీన బయలుదేరిన బృందం 27న మలేషియాలో ప్రదర్శన ఇస్తుందని కోలాటం శిక్షకురాలు పద్మజ తెలిపారు. తాళ్లపాక అన్నమాచార్యుల 12వ వంశీకులతో పాటు ప్రదర్శన ఇస్తారన్నారు. ఇప్పటి వరకు సాయి కోలాటం సభ్యులు షిర్డీ, సింహాచలం, దేవీపురం, అనకాపల్లి, విజయవాడతో పాటు పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె బాట

డాబాగార్డెన్స్ : సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి గడువు ముగిసినప్పటికీ ఏ ఒక్క సమస్య పరిష్కరించకపోవడంతో ఈ నెల 15 నుంచి మున్సిపల్ కార్మికులు సమ్మె బాట పట్టనున్నారని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉరికిటి రాజు, అధ్యక్షుడు నూకరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సిటు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జూన్ 16న కార్మిక డిమాండ్లపై జరిగిన ఒప్పందం సందర్భంగా తాత్కాలికంగా సమ్మె వాయిదా వేశామన్నారు. గత నెల 31లోగా మొత్తం 38 డిమాండ్లు పరిష్కరిస్తామని మున్సిపల్ అధికారులు హామీ ఇచ్చారని, గడువు ముగిసినప్పటికీ ఏ ఒక్క డిమాండ్ పరిష్కరించలేదని, సమస్య లు వెంటనే పరిష్కరించకపోతే ఈ నెల 15 నుంచి మున్సిపల్ కార్మికులు సమ్మె బాట పట్టనున్నారని తెలిపారు. పారిశుధ్య విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 జీతం, ఆప్కాస్‌లో చేర్చడం, యూజీడీ, పబ్లిక్ హెల్త్ డ్రైవర్లు, వెటర్నరీ, మలేరియా కార్మికులకు హెల్త్ అలవెన్స్ చెల్లించాలని, జనాభా, విస్తీర్ణం ఆధారంగా సిబ్బందిని పెంచా లని తదితర పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్. రమణ, జె. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువతపైనే దేశ భవిత

ఏయూక్యాంపస్: యువతపైనే దేశ భవిత ఆధారపడి ఉందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే బాధ్యత అధ్యాపకులదేనన్నారు. ఏయూ జాతీయ సేవా పథకం సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన యువజన అభివృద్ధి రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. జాతీయ సేవా పథకం యువతను మార్పునకు సాధనాలుగా తయారు చేయాలని, తద్వారా వారిని నిపుణులైన మానవ వనరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. సామాజిక కార్యకర్త ఆచార్య కె.శేఖర్ మాట్లాడుతూ యువతకు కెరీర్ కౌన్సెలింగ్ ఎంతో అవసరమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఈ దిశగా యువతకు మార్గనిర్దేశం చేయాలన్నారు. యువతలో నైపుణ్యాలను వృద్ధి చేయాలని, దేశానికి సంపద సృష్టించే ప్రక్రియలో వారిని భాగస్వాములు చేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా యువత - మత్తు పదార్థాలు, యువత-రిస్క్ బిహేవియర్, యువత-మాతృభాషలో విద్యాబోధన, యువత-సామాజిక మాధ్యమాలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎస్.హరనాథ్, జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి. ఎస్.భాగ్యలక్ష్మి, విజయనగరం జిల్లా ప్రోగ్రాం అధి కారి చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

'సమస్య మీది.. పరిష్కారం మాది'

ప్రత్యేక కార్యక్రమంలో ప్రజల వినతులు స్వీకరించిన నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు


ప్రజల సమస్యలు వింటున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె. రాజు

సీతమ్మధార : బాలయ్యశాస్త్రిలే అవుట్‌లో గల ఉత్తర నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె. రాజు ఆధ్వర్యంలో 'సమస్య మీది.. పరిష్కారం మాది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతులను కె.కె.రాజు స్వీకరించారు. వాటిలో కొన్నింటిని ఆయన వెంటనే పరిష్కరించారు. మరి కొన్నింటిని సంబంధిత అధికారులకు తెలియజేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్, వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెంలో ఫీవర్ సర్వే


సర్వేలో పాల్గొన్న మలేరియా అధికారులు, సిబ్బంది

సీతంపేట: జిల్లా మలేరియా విభాగం సిబ్బంది ఆధ్వర్యంలో మలేరియా జ్వర బాధితులను గుర్తించేందుకు మంగళవారం అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి సమీపంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి ఎవరైనా జ్వరంతో బాధపడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. జ్వరపీడితులకు రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సబ్‌యూనిట్ ఆఫీసర్ గడ్డం శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు వై.ఎస్.ఆర్. రత్నం, సత్యానంద్, హెల్త్ అసిస్టెంట్లు లంకశ్రీను, కోట్ని శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరెడ్డి, రామునాయుడు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాల పరిశీలన పూర్తి

భీమునిపట్నం: భీమిలి పరిధిలో ఓటర్ల జాబితాల పరిశీలన ప్రక్రియ పూర్తయిందని ఆర్‌డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి అన్నారు. మంగళవారం వివిధ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని ప్రాంతాల్లోనూ ఇంటింటికీ బీఎల్‌వోలు, బీఎల్ఏలు వెళ్లి ఓటర్ల జాబితా సరిచూశారని తెలియజేశారు.

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి


ఏకాంత ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి

సీతమ్మధార: సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్షన్‌లోని సుబ్రహ్మణ్య స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు రాజాస్వామి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, పళ్ల రసాలతో ప్రత్యేక పూజలు చేశారు. భభక్తుల గోత్రనామాలతో అర్చనలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తుకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వనజాక్షి, శివ తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి ఏకాంత ఆలయంలో..

కంచరపాలెం: స్థానిక రవీంద్రనగర్‌లో గల సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో శ్రావణ మాస శుద్ధ షష్టి మంగళవారాన్ని పురస్కరించుకుని శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామికి స్కంధ పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్రనామం, విభూది, పుష్పాలతో అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

జంక్‌ఫుడ్ చేటు.. పౌష్టికాహారమే మేలు


పోటీల విజేతలతో మ్యాజిక్ బస్ ప్రతినిధులు

తగరపువలస: జంక్‌ఫుడ్ ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని హరిస్తుందని, పౌష్టికాహారమే సంపూర్ణ ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని జీవీఎంసీ సంతపేట అంబేడ్కర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వై.జగన్నాథ స్వామి అన్నారు. మంగళవారం మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్కూల్‌లో నిర్వహించిన పౌష్టికాహార వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. జంక్‌ఫుడ్ వల్ల చిన్నారుల శరీర ఆకృతి వికృతంగా మారుతుండడమే కాకుండా ఇమ్యూనిటీ తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులకు పౌష్టికాహార పోటీలు నిర్వహించి ఎక్కువ పోషకాలతో వంటలు సిద్ధం చేసిన తల్లులకు స్టీల్ బిందెలు, పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ లంచ్ బాక్స్‌లు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నంనాయుడు, శ్రీను, మ్యాజిక్ బస్ మోనిటరింగ్ అధికారి దూడ రమేష్, ప్రతినిధులు శారద, రమ్య, సుజాత, గౌరీ శిరీష, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

20వ రోజుకి శ్రావణలక్ష్మి పూజలు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు మంగళవారం 20వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేద మంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మి పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె. శిరీష తెలిపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

7న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 7న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

సింహాద్రి అప్పన్న కల్యాణం.. కమనీయం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకుడు పెద్దరాజు తదితరులు కల్యాణం నిర్వహించారు.

పలువురు ప్రముఖులకు ఘన సత్కారం

బీచ్‌రోడ్డు: శిష్టకరణ సామాజిక వర్గంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారిని మంగళవారం శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయిక్ ఘనంగా సత్కరించారు. రామ్‌నగర్‌లోని ఆమె కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌జేడీ మణిపాత్రుని జ్యోతి కుమారి, మన్యం జిల్లా డీఎస్పీ బలివాడ నాగేశ్వరరావు, సినీ నిర్మాత బాలాజీ రామలింగం, పౌరాణిక నటులు డొంకాడ రామచంద్రరావు, సినీ దర్శకులు దుగ్గివలస దివాకర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శిష్టకరణ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు కె.వెంకటేశ్వర బెనర్జీ, రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎన్‌కే మహంతి, ఉమా మహేశ్వర రావు పాల్గొన్నారు.